VEGA
JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 301
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
శుక్రవారం 17 ఏప్రిల్ 2026

# జీఎస్డీపీ లక్ష్యాలపై సూక్ష్మస్థాయి ప్రణాళికలు

● ఉత్పాదకత పెంచటంపై అన్ని శాఖలూ దృష్టి ● సాస్కీ, పూర్వోదయ పథకాల ద్వారా అభివృద్ధి ప్రాజెక్టులు ● ఆర్థిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు వీలుగా మైక్రో, మాక్రో స్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా పూర్తి స్థాయి ఉత్పాదకతను చేరుకోవాలని ఆర్థికశాఖకు సూచించారు. 15 శాతం మేర వృద్ధి రేటు లక్ష్యాన్ని చేరుకునేలా క్షేత్రస్థాయి వరకూ ఈ ప్రణాళికల్ని సమర్థంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఆర్థిక శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నీరు, విద్యుత్ లాంటి వనరుల్ని వ్యవసాయానికి, పరిశ్రమలకు అవసరమైనంత మేరకు అందిస్తున్నామని.. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఉత్పాదకత పెంపు దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఆర్థికంగా తీవ్రమైన ఇబ్బందులు ఉన్నా విద్యుత్ ఛార్జీలు పెంచలేదని.. అలాగే గత పాలకుల నిర్ణయాల కారణంగా తలెత్తిన రూ.4600 కోట్ల విద్యుత్ భారాన్ని కూడా కూటమి ప్రభుత్వమే భరిస్తోందని అన్నారు. ప్రజలపై ఎలాంటి భారం లేకుండా ఆదాయార్జన శాఖలు రెవెన్యూ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులు పూర్తి అయితే సంపద సృష్టికి అవకాశాలు ఏర్పడతాయని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా ప్రాజెక్టులకు ఎలాంటి నిధుల కొరతా లేదని కేంద్ర సహకారంతో వాటిని పూర్తి చేసి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. పూర్వోదయ, సాస్కి లాంటి వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు వేగవంతం కావాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. సంక్షేమ క్యాలెండర్ కు అనుగుణంగానే పథకాలను అమలు చేస్తామని సీఎం అన్నారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత పాలకులు నిర్దయగా మూసివేశారని.. ఎన్ని ఇబ్బందులు ఉన్నా అన్నార్తుల కడుపు నింపేలా రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లలో భోజనం పెడుతున్నామని అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో సామర్థ్యంతో పాటు సులభతరమైన విధానాల ద్వారా పెట్టుబడులు, ఆదాయాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌లో వివక్ష ఉండదని ప్రధాని హామీ

● ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా న్యాయం చేస్తామని ప్రకటన ● ఈ అంశంపై రాజకీయం చేయవద్దని విపక్షాలకు సూచన ● మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ మీరే తీసుకోవచ్చని విపక్షాలకు ఆఫర్ ● 2029 నాటికి కోటాను అమలు చేయకపోతే మహిళలను ఒప్పించలేమని వ్యాఖ్య



**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** మహిళా రిజర్వేషన్ల అమలుకు ముందు చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) విషయంలో ఎలాంటి వివక్షకు, అన్యాయానికి తావుండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విషయంలో తాను "గ్యారెంటీ", "ప్రామిస్" వంటి పదాలను ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నానని, ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనే తేడా లేకుండా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. గురువారం లోక్‌సభలో 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ల అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చారు. "ఈ బిల్లు ఘనతను మీరే తీసుకోండి. మీకు నచ్చిన వారి ఫొటోలతో నేను ప్రకటనలు ఇవ్వడానికైనా సిద్ధం. ఈ విషయంలో మీకు 'బ్లాంక్ చెక్' ఇస్తున్నా" అని విపక్షాలను ఉద్దేశించి అన్నారు. ఈ బిల్లు దేశ రాజకీయాల దిశ, దశను మార్చే శక్తిమంతమైనదని ప్రధాని అభిప్రాయపడ్డారు. దేశ జనాభాలో సగభాగమైన మహిళలు విధాన నిర్ణయాల్లో పాలుపంచుకోవడం ద్వారా 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యాన్ని చేరుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. 2023లోనే 'నారీ శక్తి వందన్ అధినియం'ను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. "2029 నాటికి మహిళా కోటాను అమలు చేయడంలో విఫలమైతే, మన చిత్తశుద్ధిని మహిళలు నమ్మరు. దశాబ్దాలుగా వారికి నిరాకరించిన హక్కులను అందించే గొప్ప అవకాశం ఇప్పుడు మనకు లభించింది" అని మోదీ అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి పట్టణ స్థానిక సంస్థల వరకు ఇప్పటికే వేల సంఖ్యలో మహిళలు నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని, ఇప్పుడు వారిని జాతీయ స్థాయిలో విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేయాల్సిన సమయం వచ్చిందని ప్రధాని తెలిపారు. అంతకుముందు, ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడాన్ని లోక్‌సభ ఆమోదించింది. విపక్షాలు రికార్డెడ్ ఓటింగ్ కోసం పట్టుబట్టడంతో, డివిజన్ ప్రక్రియ ద్వారా దీనికి ఆమోదం లభించింది.

# రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు: ఏపీ జేఏసీ అమరావతి





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకున్నందుకు గౌరవ ఆర్థిక శాఖామాత్యులు శ్రీ పయ్యావుల కేశవ్ గారికి ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చైర్మన్ శ్రీ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి పలు సందర్భాల్లో చేసిన విజ్ఞప్తులను గౌరవిస్తూ, చెల్లింపుల్లో రిటైర్డ్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం సచివాలయంలో ఆర్థిక మంత్రిని కలిసి రాష్ట్ర నాయకత్వం ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేసింది. ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్ అయిన తరువాత సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్న బకాయిలు అందకుండానే మ-రణిస్తున్న దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయని, అలాగే మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు చెల్లించాల్సిన సెటిల్మెంట్స్ కూడా ఆలస్యమవుతున్నాయని ఏపీ జేఏసీ అమరావతి పలు మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రివర్గ ఉపసంఘంతో పాటు ఆర్థిక శాఖ అధికారులు, చీఫ్ సెక్రటరీతో కూడా అనేక సార్లు చర్చలు జరిపినట్లు తెలిపారు. తీవ్రమైన పనిభారం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి గారితో ప్రత్యేకంగా చర్చించి ఈ చెల్లింపుల ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లడంలో ఆర్థిక మంత్రివర్యులు కీలక పాత్ర పోషించారని, ఇందుకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ రావు, అసోసియేట్ చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు, కోశాధికారి తిమ్మ సత్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా కృషి చేస్తూ, పెన్షనర్లతో పాటు రెగ్యులర్ ఉద్యోగుల పెండింగ్ ప్రయోజనాలు కూడా త్వరితగతిన విడుదల అయ్యేలా ప్రభుత్వం తో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది.

**ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలి..** రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన జీతాలు చెల్లించడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని, అలాగే హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని ఆర్థిక మంత్రికి నేడు స్టేట్ గవర్నమెంట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం, అమరావతి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంటా సంపత్ తో కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ విషయంపై గౌ ॥ఆర్థిక శాఖ మంత్రివర్యులు సానుకూలంగా స్పందిస్తూ, మంత్రివర్గ ఉప సంఘం వీలైనంత త్వరగా మాట్లాడుకుని, అవసరమైతే ఉద్యోగ సంఘాల సూచనలు కూడా తీసుకుంటామని తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 62 సంవత్సరాలు వరకు రిటైర్మెంట్ వయసు; గత దశాబ్దాలుగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వయో పరిమితి ఎంత ఉందో అంతవరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కూడా పని చేసేవారు. గతంలో 60 సంవత్సరాలు వయో పరిమితి ఉన్నప్పుడు కూడా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింప జేసేవారు. కానీ ఇటీవల 62 సంవత్సరాలకు వయో పరిమితి పెంచినప్పుడు మాత్రం కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే పెంచినందున, మిగిలిన ఉద్యోగులకు పెంచనందున, రాష్ట్రంలోని కొన్ని శాఖల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మాత్రం 60 సంవత్సరాలకే రిటైర్మెంట్ చేసి ఇంటికి పంపిస్తున్నందున, ఏ పని చేయలేని ఆ వయసులో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, కనుక రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా 62 సంవత్సరాలకు మాత్రమే రిటైర్మెంట్ చేసేలా తగు ఆదేశాలు ఇవ్వాలని కోరగా, గౌ॥ఆర్థిక శాఖామాత్యులు గారిని కోరగా వారు చాలా సానుకూలంగా స్పందించారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులను ఎస్ఎంసీలకు అప్పగించండి

● అన్ని ప్రభుత్వ పాఠశాలలను 3స్టార్ కు చేర్చేలా చర్యలు చేపట్టండి ● ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు డోర్ టు డోర్ క్యాంపెయిన్ చేపట్టాలి ● ప్రభుత్వ కాలేజీల్లో అత్యుత్తమ మార్కులపై ప్రచారం కల్పించండి ● పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను స్కూలు మేనేజ్ మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లకు అప్పగించి త్వరిగతిన పూర్తిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3స్టార్ మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యిమందికి పైబడి విద్యార్థులున్న పాఠశాలలు 60 ఉన్నాయి. ఆ స్కూళ్లలో 5స్టార్ సదు-పాయాల కల్పనపై దృష్టిసారించండి. మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు ప్రాథమికోన్నత పాఠశాలలో సీట్ల కోసం పోటీ ఉంది. ఇది మంచి పరిణామం. లీక్ ప్రూఫ్ బిల్డింగ్స్, తాగునీరు, టాయ్ లెట్లు, పెయింట్స్, బల్లల ఏర్పాటు వంటి పనులను ఎస్ఎంసీలకు అప్పగించండి. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.143.27 కోట్లు అవసరం. ఈ పనులను మాత్రం రాష్ట్ర పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా చేపట్టండి. ఈ ఏడాది మోడల్ ప్రైమరీ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాలకు రూ.571.11 కోట్లు అవసరమవుతాయని నివేదించారు. వివిధ విభాగాల ద్వారా నిధులను సేకరించి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేయండి. ఏజన్సీ, మారుమూల ప్రాంతాల్లో సొంత భవనాలు లేని పాఠశాలలను గుర్తించి వెంటనే పనులు చేపట్టాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లపై అధికారులు దృష్టిసారించాల్సిందిగా మంత్రి లోకేష్ అధికారులకు సూచించారు. ఎన్ రోల్ మెంట్ పెంపుదలకు డోర్ టు డోర్ కాంపెయిన్ నిర్వహించండి. శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఇందులో భాగస్వాములను చేస్తాం. ఈసారి 10శాతం అడ్మిషన్ల పెంపుదల లక్ష్యంగా పనిచేయండి. పాఠశాలల్లో డ్రాపవుట్స్ ను జీరో స్థాయికి చేర్చాలి. బడిఈడు గల పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో స్కూలు బయట ఉండకూడదు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంపుదలకు కృషిచేయండి. స్కూళ్లలో జెండర్ సెన్సిటివిటీకి సంబంధించి మహిళలను కించపర్చే పదాలు ఎక్కడా ఉపయోగించకుండా విద్యార్థులకు అవగాహన కల్పించాలి. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి సంబంధించి శాప్ అధికారులతో సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో విస్తృత చర్యలు చేపట్టాలి. ఆసక్తిగల విద్యార్థులను గుర్తించి బ్యాడ్మింటన్, ఆర్చరీ, ఖోఖో వంటి ఆటల్లో ప్రోత్సహించాలి. కళాశాల స్థాయిలో లీగ్స్ నిర్వహించే అంశాన్ని పరిశీలించండి. రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు జూనియర్ కళాశాలలకు అనుమతులకు సంబంధించి మార్గదర్శకాలపై సమీక్షించారు. ఇంటర్మీడియట్ లో పలువురు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా ఉత్తమ మార్కులు సాధించడంపై మంత్రి లోకేష్ హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను గుర్తించి విస్తృత ప్రచారం నిర్వహించాల్సిందిగా మంత్రి లోకేష్ ఆదేశించారు. అటువంటి వారిని షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో సత్కరించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మానవవనరుల శాఖ కార్యదర్శి కోన శశిధర్, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా, పాఠశాల మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవన్ రెడ్డి పాల్గొన్నారు.

# నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

● మహిళా రిజర్వేషన్ బిల్లు చరిత్రాత్మక ముందడుగు అని కొనియాడిన పవన్ ● మహిళా సాధికారతకు జనసేన పార్టీ కట్టుబడి ఉందని స్పష్టీకరణ ● వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ప్రస్తావించిన పవన్ ● నారీశక్తి అనేది నినాదం కాదని, మన నాగరికతకు బలమని వ్యాఖ్య ● రాజ్యాంగ రూపకల్పనలో మహిళల పాత్రను గుర్తు చేసుకున్న జనసేనాని



**అమరావతి, కలంకౌంటర్ :** ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తీసుకువచ్చిన 'నారీ శక్తి వందన్ అధినియం సవరణ బిల్లు' ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా పాలనలో వారికి సముచిత స్థానం దక్కుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళా సాధికారతకు జనసేన పార్టీ మాటలతో కాకుండా చేతలతో ఎప్పుడూ మద్దతుగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్న పవన్ కల్యాణ్, "2019 ఎన్నికల్లో మేము వాగ్దానం చేసినట్లుగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల పట్ల మా నిబద్ధత, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యంపై మాకున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది" అని తెలిపారు. మహిళలు సమాజానికి పునాది అని, కుటుంబాలను తీర్చిదిద్దడం నుంచి దేశ నిర్మాణంలో పాలుపంచుకోవడం వరకు వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. "మహిళ ఎదిగితే దేశం ఎదుగుతుంది. ఇది వారికి కొత్త హక్కులు ఇవ్వడం కాదు, వారికి న్యాయంగా చెందాల్సిన వాటిని తిరిగి ఇవ్వడం. బలమైన మహిళలు బలమైన కుటుంబాలను నిర్మిస్తారు. బలమైన కుటుంబాలు బలమైన దేశాన్ని నిర్మిస్తాయి. ఇకపై 'నారీ శక్తి' కేవలం నినాదం కాదు, మన నాగరికతకు బలంగా నిలుస్తుంది. న్యాయమైన, సమానమైన, సాధికారత కలిగిన భారతదేశాన్ని నిర్మించడానికి ఈ స్ఫూర్తితో ముందుకు సాగుదాం" అని పవన్

- 4లో

# జగన్ మోహన్ రెడ్డి బ్రతుకే ఒక అరాచకం

● ఐదేళ్లు నిధులు, బిల్లులు ఇవ్వకుండా జువ్వలదిన్నె హార్బర్‌ను అడ్డుకున్నాడు ● మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీశాడు ● జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను మేము పూర్తి మౌలిక సదుపాయాలతో పూర్తి చేస్తున్నాం ● అభివృద్ధి, పెట్టుబడులకు జగన్ వ్యతిరేకి ● జగన్‌కు విధానం గొడ్డలి రాజకీయం మాత్రమే ● మంత్రి కొల్లు రవింద్ర

- 4లో



## జనగణనలో వివరాలు నమోదు చేసుకున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు



**కందుకూరు,కలంకౌంటర్ :** దేశవ్యాప్తంగా జనగణన గురువారం ప్రారంభమైన నేపథ్యంలో.... కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, తన కుటుంబ వివరాలను సొంతగా నమోదు చేసుకున్నారు.జనగణన తొలిరోజున ప్రజా ప్రతినిధులతో వివరాలు చేస్తుండగా.... స్థానిక ఎమ్మెల్యేతో, జిల్లా రెవిన్యూ అధికారి ఓబులేసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం నుంచి ఈ నెలాఖరు వరకు స్వీయ గణన జరుగుతుందని, వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఎన్యూమరేటర్లు ఇంటింటికి వచ్చి వివరాలు తీసుకుంటారని డిఆర్ఓ తెలియజేశారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, 2027 సెన్సస్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు, వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలన్నారు. అప్పుడే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన కార్యక్రమంలో తహసిల్దార్ మురళి, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పలువురు నేతలు హాజరయ్యారు.

## పీఏసీఎస్ సభ్యుని కుటుంబానికి రూ.10వేల సాయం



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సభ్యులకు సంఘం అండగా నిలుస్తుందని చినఓగిరాల పీఏసీఎస్ చైర్మన్ పాలడుగు రామకృష్ణ అన్నారు. సంఘ స భ్యుడు మైనేని రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10వేల ఆర్థిక సాయం గురువారం ఆయన కుటుంసభ్యులకు అందచేశారు. మాజీ చైర్మన్, టీడీపీ మండల అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, యార్లగడ్డ సాయి తదితరు లు పాల్గొన్నారు.

## స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ..



**కందుకూరు, కలంకౌంటర్ :** స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి మండుటెండల్లో కష్టపడి పనిచేసి జీవనం కొనసాగిస్తున్న పేద ప్రజలకు తాగు నీరు అందు-స్తూ, దాతల సహాయంతో వారంలో దాదాపుగా 4 రోజులు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుంది,అందులో భాగంగా గురువారం కొండముడుసుపాలెం గ్రామానికి చెందిన పొడపాటి రాజా అన్న పొడపాటి మహేంద్ర (మీ సేవ ఒ ఎల్ ఐ సి ) కుమారుడు పొడపాటి సాయి వత్స ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 462 మార్కులు సాధించిన శు భసందర్భంలో స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది.ఇలాగే ప్రతి ఒక్కరూ సేవా స్ఫూర్తితో మన స్కంధపురి లో భాగం కావాలని స్కంధపురి సేవా సమితి చైర్మెన్ పువ్వాడి మౌనిక ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భవనాసి వెంకటేశ్వర్లు, కోటా కిషోర్ బాబు, కంకణాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో పోలీసుల ముమ్మర తనిఖీలు

- వాహన నిబంధనలు పాటించని వారికి ఫైన్లు విధించిన పోలీసులు



**కందుకూరు, కలంకౌంటర్ :** కలంకౌంటర్, ప్రకాశం జిల్లా ఎస్పీ విష్ణువం-ర్ధన్ రాజు ఆదేశాల మేరకు కందుకూరు డిఎస్పి సిహెచ్ వి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో కందుకూరు సిఐ అన్వర్ భాష, గుడ్లూరు సీఐ లు పట్టణ ఎస్సై శివ నాగరాజు, రూరల్ ఎస్సై బాలకృష్ణ, ఉలవపాడు ఎస్సై, గుడ్లూరు ఎస్సైలు కలిసి ఒంగోలు నుంచి వచ్చిన స్పెషల్ ఫోర్స్ వారితో కలిసి పట్టణంలోని వివిధ లాడ్జీలు, మరి కొన్ని ప్రాంతాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులను ఆరా తీశారు. పోలీసు సిబ్బంది మూడు టీములుగా విడిపోయి కందుకూరు పట్టణ శివారు ప్రాంతాల్లో వాహనదారులను ఆపి, రూల్స్ పాటించని వారిపై చలానాలు విధించారు.

## తిరువూరులోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన-- ఆర్డీవో ఏ.కుమార్



**తిరువూరు,కలంకౌంటర్ :** ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి వైద్య సదుపాయాలు అందుతున్నాయో లేదో అని రోగులతో మాట్లాడి అడిగి తెలుసుకున్న--ఆర్డీవో

# స్వీయ జనగణనలో వివరాలను నమోదు చేసుకున్న సీఎం

● జనగణన ప్రక్రియలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో ఇవాల్టి నుంచి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ఇవాళ ప్రారంభమైంది. ఒవ.ఎవఅంబం.స్రశీఱ.అఅ వెబ్ సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30 తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్ లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్ గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించటం అవసరమని ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగనుందని మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ మొదలవుతుందన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన ఇండ్ల గణన( హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. మొత్తం ఈ జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

# మంత్రాలయం రోడ్డు ప్రమాదంపై మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి

-మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి



**అమరావతి,కలంకౌంటర్ :** కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకలడోన సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవ దర్శనానికి వెళ్తున్న భక్తులు ప్రమాదానికి గురై మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన పేర్కొన్నారు. శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలన్న ఆశతో బయలుదేరిన ఆ భక్తుల ప్రయాణం ఇలా అర్థాంతరంగా ముగిసిపోవడం గుండెలను పిండేస్తోందన్నారు.స్వామి సన్నిధికి చేరకముందే అనంత లోకాలకు వెళ్లడం, ఆ కుటుంబాల్లో నింపిన శోకం వర్ణనాతీతమన్నారు.భక్తితో సాగిన వారి జీవితాల్లో ఈ ప్రమాదం తీరని చీకట్లను నింపిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన భక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ దేవుడు వారి కుటుంబాలకు ఈ కష్టాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఇవ్వాలని ప్రార్థించారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని సంబంధిత అధికారులను మరియు జిల్లా యంత్రాంగాన్ని మంత్రి దుర్గేష్ ఆదేశించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం రాహత్' పథకం వరం

● రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత తక్షణ వైద్య సహాయం ● ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యం ● రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరం

● రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్





**విజయవాడ, కలంకౌంటర్ :**రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా సమయానికి చికిత్స అందిస్తే గాయపడిన వారి ప్రాణాలను రక్షించడం సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు త్వరితగతిన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు విజయవాడలోని డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆడిటోరియంలో హాల్‌లో పీఎం రాహత్ (ప్రధాన మంత్రి రోడ్ యాక్సిడెంట్ హాస్పిటలైజేషన్ అండ్ అష్యూర్డ్ ట్రీట్మెంట్ స్కీమ్) పై రాష్ట్ర స్థాయి భాగస్వాముల సంప్రదింపుల సమావేశానికి గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఇందుకు పీఎం రాహత్ పథకం క్యాష్ లెస్ సేవలు 1 లక్ష 50 వేల వరకు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, అంబులెన్స్ సేవలు, పోలీసులు మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తేనే బాధితులకు తక్షణ సహాయం అందుతుందని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని, ప్రతి ఆసుపత్రి దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మంత్రి సూచించారు. ప్రజల్లో కూడా ఈ పథకం పై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితిపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబానికి ఆదారమైన వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం ఆర్థికంగా దెబ్బతినడమే కాకుండా పిల్లల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్స్, డివైడర్ల మధ్య అకస్మాత్తుగా వాహనాలు రావడం వంటి అంశాలను గుర్తించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు 'గోల్డెన్ అవర్' విధానాన్ని 108 అంబులెన్స్ సేవల ద్వారా సమ-ర్థవంతంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ విధానం విజయశాతం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. ప్రమాద బాధితులకు తక్షణ నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు 'పీఎం రాహత్' పథకం అమలులో ఉందని తెలిపారు. ఈ పథకం ద్వారా బాధితులకు ఎటువంటి ముందస్తు చెల్లింపులు లేకుండా చికిత్స అందుతున్నట్లు చెప్పారు. గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడేందుకు 'స్టెమీ' (STEMI) కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నామని, ఈ కార్యక్రమం ద్వారా వేలాది మంది ప్రాణాలు రక్షించగలిగామని తెలిపారు. రాష్ట్రంలో అత్యాధునిక వైద్య సదుపాయాల అభివృద్ధి దిశగా 14 క్రిటికల్ కేర్ బ్లాకులను నిర్మించగా, మరిన్ని బ్లాకుల నిర్మాణానికి చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌ను ప్రమాద రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం, ప్రతి ఒక్కరి ప్రాణాన్ని కాపాడడం మనందరి సామూహిక బాధ్యత అని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ సౌరభ్ గౌర్ మాట్లాడుతూ... 2025లో రాష్ట్రంలో సుమారు 18,380 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో ఎక్కువగా నేషనల్, స్టేట్ హైవేలు మరియు ప్రధాన రోడ్లపైనే జరిగాయని పేర్కొన్నారు. ప్రమాదాలకు అతివేగం (79%) ప్రధాన కారణమని, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవింగ్, మొబైల్ వినియోగం కూడా కారణాలని వివరించారు. సాయంత్రం 6 నుంచి 9 గంటల మధ్య ప్రమాదాలు అధికంగా నమోదవుతున్నాయని చెప్పారు. 'పీఎం రాహత్' పథకం ద్వారా బాధితులకు రూ.1.50 లక్షల వరకు ముందస్తు చెల్లింపులు లేకుండా చికిత్స అందుతున్నదని, 'గోల్డెన్ అవర్'లో అత్యవసర వైద్యం అందించేందుకు ప్రభుత్వ-ప్రైవేట్ ఆసుపత్రులను అనుసంధానం చేస్తున్నామని తెలిపారు. ప్రతి 100 కిలోమీటర్లకు ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేసి వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ... జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే సుమారు 130 బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి, అందులో 27 కీలక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వచ్చే ఏడాదిలో ప్రమాదాలను 50% తగ్గించడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. 'పీఎం రాహత్' పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, బాధితులకు తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సామాజిక బాధ్యతగా ప్రమాద బాధితులను ఆసుపత్రులకు తరలించే 'గుడ్ సమారిటన్స్'ను ప్రోత్సహిస్తున్నామని, ప్రతి నెల రోడ్డు భద్రతా కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ శాఖల మధ్య సమన్వయం పెంచుతున్నామని వెల్లడించారు. రోడ్డు భద్రతలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ ఎన్. సూర్యచంద్రరావు, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎస్. వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డా. రఘునందన్ రావు, వివిధ ఆసుపత్రుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దక్షిణాదిలో జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతున్నాయ్: లోక్‌సభలో అమిత్ షా

**న్యూఢిల్లీ, కలంకౌంటర్ :** డీలిమిటేషన్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్?సభలో కీలక కామెంట్స్ చేశారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని అంటున్నారని చెప్పుకొచ్చారు. వాస్తవానికి దక్షిణాదిలో జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతున్నాయన్నారు. ఏపీలోని 25 సీట్ల నుంచి 38 సీట్ల వరకు, తెలంగాణలో లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు పెరిగుతాయని చెప్పారు. తమిళనాడు, కర్ణాటకలోనూ సీట్లు పెరుగుతాయని సీట్లు పెరుగుతాయని వివరించారు.

## 23న రాష్ట్ర పండుగగా భగీరథ జయంతి

-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

**అమరావతి,కలంకౌంటర్ :** ఈ నెల 23న మహర్షి భగీరథుని జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఆరోజు రాష్ట్ర వ్యాప్తంగా భగీరథుని జయంతి అధికారికంగా నిర్వహించేలా కూటమి ప్రభుత్వం జీవో జారీచేసిందన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సగర కులస్తుల ఆరాధ్య దైవం మహర్షి భగీరథుడన్నారు. ఒంటికాలిపై నిల్చొని, భారీ తపస్సు చేసి, గంగను దివి నుంచి భువి తీసుకొచ్చిన మహానీయుడన్నారు. తన పట్టుదలతో, కఠోర తపస్సుతో భగీరథుడు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. భగీరథుని త్యాగం, పట్టుదల నేటి తరానికి తెలియజేయాలన్న సంకల్పంతో ఆ మహానీయుని జయంతిని ఈ నెల 23న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్నామన్నారు. కర్నూలులో భగీరథుని రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం చేపట్టనున్నామన్నారు. గతేడాది విశాఖలోని గాజువాకలో అంగరంగ వైభవంగా భగీరథుని రాష్ట్ర స్థాయి జయంతిని నిర్వహించినట్లు మంత్రి సవిత గుర్తు చేశారు.

## తిరుపతిలో కర్ణాటక నేరస్థుడ్ని గుర్తించిన సీసీ కెమెరాలు

● నిందితుడి వాహన కదలికలపై పోలీసులకు అలర్టులు పంపిన ఆర్టీజీఎస్

● నిందుతుడ్ని సకాలంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు

**అమరావతి,కలంకౌంటర్ :** కర్ణాటక రాష్ట్రంలో లైంగిక వేధింపుల కేసులో నిందితుడు తిరుపతిలోని సీసీకెమెరా కళ్లలో పడి పోలీసులకు చిక్కాడు. కర్నాటకలో ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ వ్యక్తిపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు పరారీలో ఉండటంతో పోలీసులు అతడ్ని పట్టుకోవడానికి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నిందితుడు ఇటీవల తిరుపతికి పారిపోయి వచ్చాడనే సమాచారం అందుకున్న కర్ణాటక పోలీసులు ఏపీ పోలీసుల సహకారం కోరారు. కర్ణాటక పోలీసులు నిందితుడి వాహనానికి సంబంధించి ఇచ్చిన వివరాల ఆధారంగా ఆ వాహనం కదలికలను ఆర్టీజీఎస్‌లోని సీసీటీవీ360 వ్యవస్థ ద్వారా గుర్తించారు. ఆ వాహనం ఎక్కడెక్కడ తిరుగాడింది, ప్రస్తుతం ఆ వాహనం ఎక్కడ ఉంది అనే వివరాలను ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఏఎన్‌పీఆర్) విశ్లేషణ ద్వారా గుర్తించి ఆ సమాచారాన్ని ఆర్టీజీఎస్ పోలీసులకు అలర్టుల ద్వారా చేరవేసింది. దీని ఆధారంగా పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు.

## శిలాఫలకాలపై ఎమ్మెల్యే కీలక నిర్ణయం



**అవనిగడ్డ,కలంకౌంటర్ :** ప్రత్యేక కార్యక్రమాలకు మినహా ప్రతి కార్యక్రమానికి శిలాఫలకాలు వేసే సంప్రదాయానికి స్వస్థి పలకాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో అధికారులకు సూచించారు. శంకుస్థాపనలను భూమి పూజ ద్వారాను, ప్రారంభోత్సవాలను రిబ్బన్ కటింగులతో ముగించాలని అధికారులకు సూచించారు. తాము ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్నాము గానీ శిలాఫలకాలపై పేర్ల కోసం కాదని స్పష్టం చేశారు. అంతేకాకుండా శిలాఫలకాలకు వెచ్చించే ఖర్చును తగ్గించినట్లు అవుతుందని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పేర్కొన్నారు.

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
కలంకౌంటర్ దినపత్రిక లో యాడ్స్ కోసం సంప్రదించండి..
సెల్ : 9346935672

# రాజేంద్రప్రసాద్ కు శుభాకాంక్షలు



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడుగా నియమితులైన యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్కు పలువురు పార్టీనాయకులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. పలుసంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీ పట్ల అంకితభావంతో ఉంటూ, పార్టీకి ఎనలేని సేవలందించిన రాజేంద్రప్రసాద్ను టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడుగా నియమించడం సంతోషకరమన్నారు. మండవ జయదేవ్, లక్ష్మీనారాయణ రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు రాజేంద్రప్ర సాద్కు శుభాకాంక్షలు తెలిపారు.

# శుభాకాంక్షలు



**విజయవాడ,కలంకౌంటర్ :** ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ ను టీడీపీ అధికార ప్రతినిధి గా నియమించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి సన్మానించి ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు కొత్తగుండు రమేష్,మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొగ్గవరపు రాజారావు.

## పెనుగాలను గ్రంథాలయం లో నవయుగ వైతాళికుడు కందుకూరి జయంతి వేడుకలు



**గంపలగూడెం (ఎన్టీఆర్ జిల్లా),కలంకౌంటర్ :** గంపలగూడెం మండలం పెనుగొలను గ్రంథాలయంలో గురువారం తెలుగు నవయుగ వైతాళికుడు, సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కందుకూరి స్త్రీ విద్య, వితంతువుపునర్వి వాహాలు, బాల్య వివాహాలనిర్మూల కోసం, మూఢనమ్మకాలపై అలుపెరగని పోరాటాలు చేసి, బాలికల విద్య కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేశారని విశ్రాంత ఎం ఈఓ.వి శేషి రెడ్డి తెలిపారు. ప్రజలను చైతన్య పరచుటకు అనేక రచనలు చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు తెనాలి వెంకటేశ్వర్లు, శిరిడి సాయిబాబా కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలకు సమీపంలో పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు - .జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్







**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లాలో విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణా షాపుల్లో సిగరెట్స్, నిషేధిత ఖైనీ, గుట్కాలు, మత్తు కలిగించే ఇతర పొగాకు వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' పేరుతో స్థానిక పోలీసులు, ఈగల్, ఎస్బీ పోలీసులు సంయుక్తంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పాన్ షాపులు, కిరణా షాపుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తం గా విద్యాసంస్థలకు సమీపంలోని పాన్ షాపులు, కిరాణ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ ప్రత్యేక డ్రైవులో భాగంగా విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తులను విక్రయించిన 347మంది వ్యాపారులపై కోట్పా చట్టం (ది సిగరెట్స్ అండ్ అదర్ టొబాకో ప్రొడక్ట్స్ 2003 చట్టం) ప్రకారం కేసులు నమోదు చేసి, వారికి రూ.52,250/–లను జరిమానాగా విధించామన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పొగాకు ఉత్పత్తులు వలన కలిగే అనర్ధాలను తగ్గించేందుకు, విక్రయాలు, ప్రచారం, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానంను నియంత్రించుటకు కోట్పా చట్టంను 2003లో భారత ప్రభుత్వం అమలులోకి తీసుకొని వచ్చిందన్నారు. విద్యాలయాలకు దగ్గరలో ఉన్న పాన్ షాపులు, కిరాణ షాపుల్లో పొగాకు ఉత్పత్తులను విక్రయించడం వలన విద్యార్థులు వీటిని వినియోగించేందుకు అలవాటుపడి, చెడు మార్గంలో ప్రయాణించే అవకాశం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పొగాకు ఉత్పత్తులను విక్రయించకుండా చర్యలు చేపట్టేందుకు వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని, పొగాకు ఉత్పత్తుల విక్రయాలకు స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ తరహా దాడులు భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ స్పష్టం చేసారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషను పరిధిలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్ లో సంబంధిత సిఐలు, ఎస్ఐలు పాల్గొనగా, సంబంధిత డిఎస్పీలు ఈ స్పెషల్ డ్రైవును పర్యవేక్షించారు.

## ఈ నెల 18న పండగలా.. ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకలు

- సమష్టి కృషితో విజయవంతం చేద్దాం
- మన ఘన వారసత్వ సంపదను భావితరాలకు అందిద్దాం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**విజయవాడ,కలంకౌంటర్ :** రాష్ట్ర పర్యాటక, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం (ఔశీతీశ్రీ్స ఎవతీ-ఞ్ఖుస్త్రవ ఋఖఎ) సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ గుర-ువారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి రెవెన్యూ, పర్యాటకం, పోలీసు, వైద్య ఆరోగ్యం, మునిసిపల్, విద్యుత్, అగ్నిమాపక తదితర సమన్వయ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. అనంతరం కొండపల్లిలోని కొండపల్లి బొమ్మల ఎక్స్పీరియన్స్ సెంటర్ ప్రాంతాన్ని సందర్శించారు. కొండపల్లి బొమ్మల మేళాకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమాలకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 18వ తేదీ ఉదయం కొండపల్లి ఖిల్లాపైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మినీ మారథాన్, సైక్లింగ్, యోగా సెషన్స్, సంప్రదాయ క్రీడలు వంటివి కూడా వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా కొండపల్లిలో కొండపల్లి బొమ్మలతో మేళా కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఇది 18వ తేదీ మొదలు మూడు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగిందని.. ఇందులోని విజేతలకు కొండపల్లి బొమ్మల మేళా కార్యక్రమం సందర్భంగా రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్టీఏసీహెచ్) భాగస్వామ్యంతో విజయవాడ నగరంలో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం పక్కన ఖాళీ స్థలంలో సంగీత ఝరి మ్యూజికల్ ఈవెంట్తో సంస్కృతీ వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమాల్లో ఇన్టాక్, రెడ్క్రాస్, వాసవ్య మహిళా మండలి, గాంధీ స్మారకనిధి, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ తదితర సంస్థలు కూడా భాగస్వామ్యమవుతున్నట్లు వివరించారు.

## ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి "షూ డియోడరైజర్"లను అందజేసిన జిల్లా ఎస్పీ





**విజయనగరం,కలంకౌంటర్ :** జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్గంధ "షూ డియోడరైజర్"లి లను అందజేసారు. రోడ్లపై ట్రాఫిక్ విధులు నిర్వహిస్తూ ఎక్కువ సమయం ఎండలో గడిపే ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా రూ.400/– (ఒక్కొక్కటి) విలువగల షూ డియోడరైజర్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ – రోజంతా బూట్లు ధరించి విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బందికి పాదాల పరిశుభ్రత , దుర్వాసన నివారణ ఎంతో ముఖ్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. కావున ఈ డియోడరైజర్ల వినియోగం ద్వారా పాదల ఆరోగ్యం మెరుగుపడటం, దుర్వాసనను అరికట్టడంతో పాటు రోజువారీ విధుల్లో మరింత సౌకర్యంగా ఉండగలరని తెలిపారు. ఈ షూ డియోడరైజర్ లను పరీక్షించగా, బూట్లలో ఏర్పడిన బాక్టీరియా దుర్వాసన పోయి జీరో లెవెలుకు వచ్చిందని తెలిపారు. ఇది ఒక ఆయుర్వేదంలాగ పనిచేస్తుందని, దీనిని వాడడం వలన ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని, పాదాలను సురక్షితంగా ఉంచుతుందని, కావున ప్రతిరోజూ వినియోగించి బూట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి తెలిపారు. సిబ్బంది సంక్షేమం కోసం ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని ఎస్పీ తెలిపారు. అనంతరం వీటిని స్పాన్సర్ చేసిన "ప్యూర్ బీస్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్" మేనేజర్ రఘు, చెరుకూరి శ్రీధర్ పుషోత్తం లను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సురినాయుడు, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఎస్ఐ భాస్కరరావు , ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలం మల్లేశ్వరం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నందు 2024–25 ఆర్థిక సంవత్సరం యూనియన్ 3 వ విడత బోనస్ పంపిణీ కార్యక్రమశీ గురువారం జరిగింది. ఈ బోనస్ పంపిణీ కార్యక్రమంలోకృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో 170 మంది పాల ఉత్పత్తి దారులకు రూ 2,12,880/– పంపిణీ చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ యూనియన్ అందిస్తున్న పథకాలు వివరిస్తూ యూనియన్ పాడి రైతులకు అభ్యున్నతికి చేస్తున్న కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు మరియు పెదన గ్రౌజ సభ్యులు అర్జా వెంకట నగేష్ , కృష్ణ మిల్క్ యూనియన్ ట్రస్ట్ సభ్యులు కాగిత జయరామ్ , డాక్టర్ లింగం ప్రసాద్ , పామర్రు పాల శీతల కేంద్రం మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ , డాక్టర్ శివ రామ కృష్ణ , సంఘ అధ్యక్షురాలు పేపేటి వీరమ్మ , సూపర్ వైజర్ చొప్పకట్ల వర ప్రసాద్ , కృత్రిమ గర్భోత్పత్తి సెమెన్ వర్కర్ మల్లికార్జున రావు, వెటర్నరీ సిబ్బంది, సంఘ పాలకవర్గ సభ్యులు,పాల ఉత్పత్తి దారులు, సిబ్బంది మరియు పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బంది తీరు మారకపోతే చర్యలు తప్పవు - ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** గుడ్ మార్నింగ్ కందుకూరు అంటూ రోజు ఉదయాన్నే పట్టణంలోని పలు వార్డుల్లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు నేరుగా పట్టణ ప్రజల ఇంటి ముందు వాక్ చేస్తూ క్షేత్ర స్థాయి పరిశీలనకు దిగారు.ఇటీవల కాలంలో పట్టణంలోని పారిశుధ్యంపై ప్రజల నుండి ఇబ్బడి ముబ్బడిగా ఫిర్యాదులు రావడంతో గ్రౌండ్ లెవెల్ లో వెళ్ళి సమస్య తెలుసుకునేందుకు నడుం బిగించారు.గ్రౌండ్ లెవెల్ లో ఉన్న పరిస్థితులను చూసి మున్సిపల్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా పనితీరు మార్చుకోరా అని మందలించారు. కొన్నిచోట్ల పేరుకుపోయిన కాలువలు, పాడుబడిన డ్రైనేజీలను స్వయంగా చూసిన ఎమ్మెల్యే తక్షణ చర్యలు, శాశ్వత పరిష్కారం కొరకు అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డులు, కాలనీలలో పారిశుధ్య సమ-స్యలు ఉంటే నేరుగా తనను ఫోన్ ద్వారా కాని డైరెక్ట్ గా అయిన కలవాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.ఇదే క్రమంలో ఈ మధ్య ఆకస్మికంగా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి పట్టణంలో పారిశుధ్యం పై కమిషనర్ తో సహా సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# జగన్ మోహన్ రెడ్డి బ్రతుకే ఒక అరాచకం

- ఐదేళ్లు నిధులు, బిల్లులు ఇవ్వకుండా జువ్వలదిన్నె హార్బర్‌ను అడ్డుకున్నాడు
- మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీశాడు
- జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను మేము పూర్తి మౌలిక సదుపాయాలతో పూర్తి చేస్తున్నాం
- అభివృద్ధి, పెట్టుబడులకు జగన్ వ్యతిరేకి
- జగన్‌కు విధానం గొడ్డలి రాజకీయం మాత్రమే
- మంత్రి కొల్లు రవింద్ర

**మంగళగిరి/అమరావతి,కలంకౌంటర్ :** జువ్వలదిన్నె హార్బర్ నిర్మాణంపై జగన్ దుష్ప్రచారం చేస్తున్నాడని, మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసిన వ్యక్తి మత్స్యకారుల సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవింద్ర మండిపడ్డారు. గురువారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "నిన్న నెల్లూరు పర్యటనలో జగన్మోహన్ రెడ్డి మరోసారి తన అసహనాన్ని బయటపెట్టాడు. రాష్ట్ర అభివృద్ధి జరుగుతుండటం తట్టుకోలేక, వివిధ వర్గాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశాడు. ఎక్కడైనా అవకాశం దొరికితే అల్లర్లు రేపాలనే ధోరణి ఆయన వ్యవహారంలో స్పష్టంగా కనిపిస్తోంది. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో కూడా ఆయన దుష్ప్రచారానికి దిగారు. మత్స్యకారులను రెచ్చగొట్టేందుకు అసత్యాలు ప్రచారం చేశారు. జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఈ హార్బర్ నిర్మాణానికి నిధులు, బిల్లులు ఇవ్వకుండా అడ్డుకున్నాడు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు వేగవంతమై, ప్రాజెక్టు దాదాపు పూర్తి స్థాయికి చేరుకుంది. 901 మీటర్ల జెట్టీ, ఫిష్ ల్యాండింగ్ సెంటర్, కోల్డ్ స్టోరేజీలు, వలల భద్రత కోసం గదులు వంటి అన్ని సౌకర్యాలతో ఆధునిక హార్బర్‌గా దీనిని అభివృద్ధి చేస్తున్నం" అని తెలిపారు.

**మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసింది జగనే..** "మత్స్యకారుల విషయంలో కూడా ఆయన పాలనలో అనేక అన్యాయాలు జరిగాయి. చెరువులపై హక్కులను దెబ్బతీసే విధంగా జారీ చేసిన జీవో నెంబర్ 217 ద్వారా వారి జీవనోపాధిని ప్రమాదంలోకి నెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ జీవోను రద్దు చేసి మత్స్యకారులకు న్యాయం చేసింది. చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోనే మత్స్యకారులకు పెన్షన్ పథకం ప్రారంభమైంది. వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం కూడా అప్పుడే మొదలైంది. రూ.4 వేలుగా ప్రారంభమైన ఈ సహాయం నేడు రూ.20 వేల వరకు పెరిగింది. ఆయిల్ సబ్సిడీలు, ఇతర సదుపాయాలు కూడా అందిస్తున్నాం. గతంలో వేటకు వెళ్లి మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఐదేళ్ల పాటు సహాయం అందకపోయినా, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పెండింగ్ నిధులను విడుదల చేసి వారికి అండగా నిలిచింది" అని అన్నారు.

**తమిళనాడు బోట్ల విడుదల అంశంలో జగన్ దుష్ప్రచారం..** "సముద్ర గస్తీ విషయంలో కూడా జగన్ పాలనలో నిర్లక్ష్యం జరిగింది. 2017లో ఇతర రాష్ట్రాల బోట్లు రాకుండా మెరైన్ బోట్లు గస్తీ కాస్తుండగా, 2019 తర్వాత అవన్నీ నిలిచిపోయాయి. రిపేర్లు, మెయింటెనెన్స్ లకు కూడా డబ్బులు ఇవ్వకపోవడం, సిబ్బందిలను తొలగించడం వల్ల సముద్ర సరిహద్దులు బలహీనపడ్డాయి. ఫలితంగా తమిళనాడు బోట్లు వచ్చి మన మత్స్య సంపదను దోచుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితిని గుర్తించిన వెంటనే చంద్రబాబు నాయుడు గారు, నారా లోకేష్ గారు అధికారులను అప్రమత్తం చేసి స్పీడ్ బోట్లు ఏర్పాటు చేశారు. 650 హార్స్ పవర్ ఇంజిన్లతో గస్తీ బలపరిచి, అక్రమంగా వచ్చిన బోట్లను నియంత్రించే చర్యలు చేపట్టారు. తమిళనాడు బోట్లను పట్టుకున్న తర్వాత యువనేత నారా లోకేష్ చెప్పడం వలనే ఆ బోట్లను పోలీసులు విడుదల చేశారు అనడం కూడా పూర్తిగా అవాస్తవం. "ఇది మా గ్రామాల సమస్య, మేము చర్చించుకొని పరిష్కరించుకుంటాం" అని స్థానిక గ్రామాల ప్రజలు చెబితే వారి అభిప్రాయాన్ని గౌరవిస్తూ, వారి నిర్ణయాల ప్రకారమే ముందుకు వెళ్లాం. అయినా కూడా ఈ అంశాన్ని రాజకీయంగా మలచాలని జగన్ చేసిన ప్రయత్నం బాధాకరం" అని అన్నారు.

**దేశ రక్షణపై జగన్‌కు బాధ్యత లేకే సాగర్ సంస్థను తరిమేస్తా అంటున్నాడు..** "జువ్వలదిన్నెలో కేంద్ర అనుమతితో సాగర్ డిఫెన్స్ సంస్థకు భూమి కేటాయించడం జరిగింది. ఇది దేశ రక్షణకు ఉపయోగపడే కీలక ప్రాజెక్ట్. భవిష్యత్తులో సముద్ర తీర ప్రాంత భద్రతను బలోపేతం చేయడంలో ఈ సంస్థ చేసే పరిశోధనలు ఎంతో ఉపయోగపడతాయి. ఇలాంటి ప్రాజెక్టులను వ్యతిరేకించడం ద్వారా జగన్ దృష్టిలో దేశ ప్రయోజనాలపై ఎంత నిర్లక్ష్యం ఉందో తెలుస్తోంది. "మొత్తం హార్బర్‌ను సాగర్ డిఫెన్స్‌కు ఇచ్చేస్తున్నారు" అంటూ జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. నిజానికి, కేవలం 170 మీటర్ల ప్రాంతాన్ని మాత్రమే ఆ సంస్థకు కేటాయించాం. కనీస అవగాహన లేకుండా ప్రజల్లో అపోహలు సృష్టించడం దురదృష్టకరం. జగన్‌కు తల్లి అంటే ప్రేమ లేదు కాబట్టి వెళ్లగొట్టాడు.. చెల్లి అంటే ప్రేమ లేదు కాబట్టి వెళ్లగొట్టాడు. సొంత బాబాయిని వేసేసాడు. రాష్ట్ర ప్రజలు ఓటు వేయలేదని రాష్ట్రం నాశనం అయిపోవాలని జగన్ కోరుకుంటున్నాడు. చివరికి దేశం అంటే కూడా భక్తి లేనటువంటి ఒక దుర్మార్గమైన ఆలోచన ఉన్న వ్యక్తి జగన్మోహన్ రెడ్డి. ఈ దేశ రక్షణ కోసం జవాన్లు ప్రాణాలు అర్పిస్తున్నారు. బోర్డర్లో మన సైనిక సోదరులు మనకి రక్షణగా ఉంటున్నారు. రాబోయే రోజుల్లో సముద్ర తీర ప్రాంతాల్లో పక్క దేశాలు ఏవైనా మన దేశంపై దాడులు చేయాలని ప్రయత్నం చేసినప్పుడు ఈ సాగర డిఫెన్స్ చేస్తున్నటువంటి రీసెర్చ్ ద్వారా దేశాన్ని రక్షించడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇటువంటి సంస్థను తరిమి కొడతాను అంటున్నాడు అంటే జగన్ వ్యక్తిత్వం ఏంటో అర్థం అవుతుంది. జగన్‌కు ఉన్న ప్రేమ ఉన్నదల్లా ఒకటే గొడ్డలి పార్టీ, గొడ్డలి



గుర్తు. ఏదైనా నరుక్కుంటూ పోవడమే జగన్మోహన్ రెడ్డి నైజం. అభివృద్ధిని అడ్డుకోవడం, అపోహలు సృష్టించడం, ప్రజలను రెచ్చగొట్టడం ఇవే జగన్ రాజకీయ విధానం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అభివృద్ధి, పెట్టుబడులను అడ్డుకునే చరిత్ర జగన్ రెడ్డిది..** "2019-24 మధ్య 800 సంస్థలను ఈ రాష్ట్రం నుంచి తరిమికొట్టిన వ్యక్తి ఎవరో ప్రజలు గుర్తుంచుకోవాలి. 2014--19 మధ్య గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు మైనస్ 6 డిగ్రీల చలిలో దావోస్‌కు వెళ్లి, ప్రపంచ సంస్థల ముందుకు మన రాష్ట్ర వనరులు, అవకాశాలను వివరించి పెట్టుబడులకు ఆహ్వానించారు. అలా అనేక సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తే, తరువాతి కాలంలో వాటిని భయపెట్టి వెళ్లగొట్టిన పరిస్థితి ఏర్పడింది. కియా మోటార్స్ వంటి సంస్థలను బెదిరించడంతో వారు మరో యూనిట్‌ను తమిళనాడుకు తరలించుకున్నారు. అమరరాజా బ్యాటరీస్ రాష్ట్రాన్ని విడిచి తమిళనాడు, తెలంగాణకు వెళ్లింది. లూలు గ్రూప్ అధినేత యూసుఫ్ అలీ స్వయంగా పత్రికా ప్రకటన ఇచ్చి "ఆంధ్రప్రదేశ్‌కు రావొద్దు" అని చెప్పే స్థితి ఎందుకు వచ్చింది? ఇవన్నీ జరిగినవి వాస్తవాలు కాదా? ఎంపీలు, నాయకులు వెళ్లి బెదిరింపులు, బ్లాక్ మెయిలింగ్ చేసిన సంఘటనలు లేవా? ఇప్పుడు అదే రాష్ట్రంపై మళ్లీ నమ్మకం తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో సుమారు 25% పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు రావడం, ఈ ప్రభుత్వంపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనం. ఒకప్పుడు "వచ్చే సంస్థలన్నీ వెళ్లగొడతా" అన్న అనడంతో జగన్ విశ్వసనీయత ఏంటి? ప్రజలు జగన్‌పై నమ్మకం లేకే 11 సీట్లకు పరిమితం చేశారు" అని ఎద్దేవ చేశారు.

**రాష్ట్రాభివృద్ధిపై జగన్‌కు చిత్తశుద్ధి లేదు..** 'అమరావతి విషయంలో కూడా దాడులు, అనిశ్చితి సృష్టించడం వల్లే పెట్టుబడిదారుల్లో అనుమానాలు పెరిగాయి. అందుకే అమరావతికి చట్టబద్ధత కల్పించి, రాష్ట్ర అభివృద్ధికి స్థిరత్వం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. "నేను వస్తే చట్టాన్ని మార్చేస్తా" అనే విధంగా మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. ఇక్కడ ప్రజలు కోరిందే జరుగుతుంది, వ్యక్తిగత అజెండాలు కాదు. ఇవాళ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, యువనేత నారా లోకేష్ గారి స్ఫూర్తితో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. విశాఖపట్నంలో గూగుల్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. భారీ స్థాయిలో మెటల్, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు వేల కోట్ల పెట్టుబడులతో లక్షలాది ఉద్యోగాలను సృష్టించబోతున్నాయి. క్వాంటం కంప్యూటింగ్ వంటి భవిష్యత్ సాంకేతికతలను ముందుగానే రాష్ట్రానికి తీసుకురావాలన్న దూరదృష్టి ఈ ప్రభుత్వానికి ఉంది. దేశవ్యాప్తంగా డేటా సెంటర్ల సామర్థ్యం 1 గిగావాట్ లోపే ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లోనే ఇప్పటికే 3 గిగావాట్ల పనులు జరుగుతుండగా, మరో 3 గిగావాట్లు ప్రణాళికలో ఉన్నాయి. ఈ అభివృద్ధిని చూసి తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారని ప్రజలు గ్రహించాలి. సాగర్ డిఫెన్స్ వంటి సంస్థలు వస్తే వేలాది ఉద్యోగాలు వస్తాయి, మత్స్యకారులు కూడా ఉద్యోగస్తులుగా మారే అవకాశాలు ఉంటాయి. కానీ అలాంటి ప్రాజెక్టులపైనా జగన్ వ్యతిరేకత వ్యక్తం చేయడం బాధాకరం" అని అన్నారు.

**రాష్ట్రాభివృద్ధే మా ధ్యేయం -- విధ్వంసమే జగన్ నైజం..** "గత ఐదేళ్లలో మీడియాపై ఒత్తిడి, ఉద్యోగులపై బెదిరింపులు, ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, నాయకులను జైలుకు పంపించడం వంటి చర్యలు జరిగాయి. చివరకు ప్రజల విశ్వాసాన్ని కూడా పొందలేకపోయారు. ప్రజాస్వామ్యంలో అది అసాధ్యం. ఈ ప్రభుత్వం మాత్రం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే సంకల్పంతో ముందుకు సాగుతోంది. అన్ని వర్గాల అభివృద్ధి, యువతకు ఉపాధి, రాష్ట్రానికి గౌరవం తీసుకురావడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి తెలిపారు.

## ప్రభుత్వ ఆశయాలకు నిదర్శనం... ప్రభుత్వ లేడీ యాంప్తుల్ కళాశాల ఫలితాలు..





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఇంటర్మీడియట్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థినులకు గురువారం మచిలీపట్నం ప్రభుత్వ లేడీ యాంప్తుల్ బాలిక కళాశాలలో అభినందనలు జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు లంకిశెట్టి బాలాజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లంకి శెట్టి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కే పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగంలో నూతన విద్య సంస్కార్ణాలు కు మచిలీపట్నం లేడీయాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సాధించిన ఇంటర్మీడియట్ ఫలితాలు రుజువు చేశాయని అన్నారు. స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఈ సంవత్సరం జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించినందుకు, 95%కంటే ఎక్కువ మార్కులు సాధించిన 30 విద్యార్థులను అభివృద్ధి కమిటీ సభ్యులు లంకిశెట్టి బాలాజీ మచిలీపట్నం సిటీ కేబుల్ డైరెక్టర్ కోల్లు జ్ఞాన సాయి ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ పి.లక్ష్మి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన కళాశాలలో చరిత్ర సృష్టించిన విద్యార్థుల వెనుకాల అధ్యాపకులు పాత్ర అభినందనీయం అన్నారు. కేవలం అతి తక్కువ ఫీజుతో ప్రభుత్వమే యూనిఫారం పుస్తకాలు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలియజేశారు జిల్లాలో గల ఏకైక మహిళ జూనియర్ కళాశాల నేడు కార్పొరేటు కళాశాలకు దీటుగా ఫలితాలు అందించిందని అన్నారు. కొల్లు జ్ఞానసాయి మాట్లాడుతూ 25 సంవత్సరాలనుండి తన తండ్రి కొల్లు శ్రీనివాస్ ఎన్నో రకాలుగా కళాశాల అభివృద్ధి కోసం విద్యార్థినిల సంక్షేమం కోసం పలు సహాయసహకారాలు అందిస్తున్నారని విద్యార్థులు ఈ విధంగా ప్రతిభ కనబరిచినందుకు అయన అభినందించారు. ఈ కార్యక్రమం లో ఎన్. ఎస్. ఎస్.ప్రోగ్రాం అధికారి లంకిశెట్టి హరనాధ్ బాబు అధ్యాపకులు హిరణ్మయి, సురేష్ తదితరులు పాల్గొన్నారు

## సమాజానికి దిక్సూచికలు నాటికలు - లంకిశెట్టి బాలాజీ





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** సమాజానికి దిక్సూచికలు నాటికలు అని ప్రముఖ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. నాటకం నవరసభరితంగా ఉండి అన్ని వయసుల వారిని ఆకట్టుకుంటుందన్నారు. తెలుగు నాటక దినోత్సవం సందర్భంగా స్థానిక బెల్ ఆడిటోరియంలో శ్రీ దుర్గా మల్లేశ్వరి కళా పీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సందేశాత్మక నాటకాలతో సమాజ చైతన్యం జరుగుతుందని అన్నారు. ఆర్టీసీ మచిలీపట్నం డిపో మేనేజర్ టి .పెద్దిరాజు మాట్లాడుతూ నేటియువత నాటకాలు నేర్చుకుని ప్రదర్శించాలని సూచించారు. మన గత తెలుగు నాటక వైభవాన్ని నేటి యువత తెలుసుకోవాలన్నారు .భావ తరంగిణి అధ్యక్షులు భవిష్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో కళా పీఠం అధ్యక్షులు చలమలశెట్టి గాంధీ నటులు గాజుల కృష్ణమూర్తి నాయుడు, జన్ను నారాయణ, ఏలేశ్వరపు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌరాణిక నటులు ఎం సాంబశ్రీ నీ కళాపీఠం ఘనంగా సన్మానించింది .పలువురు కళాకారులకు ఆభరణాలను, నూతన వస్త్రాలను బహుకరించారు .తదుపరి ప్రదర్శించిన సత్యహరిచంద్ర నాటకంలోని వేట శీను అందర్నీ ఆకట్టుకుంది. కళాపీఠం అధ్యక్షులు చలమల శెట్టిగాంధీ సారధ్యంలో స్థానిక నారాయణపురం ఎస్సీ కాలనీ లోని వారికి భోజనాలు ఏర్పాటు చేశారు.

## మజ్జిగ పంపిణీ



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** ఉదయపు నడక మిత్ర మండలి ఆధ్వర్యంలో నాలుగవ రోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈరోజు మజ్జిగ దాత ఎండపల్లి నిత్విక్ .ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జల్లు మురళీనాథ్ ట్రెజరర్ వేద లక్ష్మీనరసింహం కొండూరు భద్రం తదితర సభ్యులు పాల్గొన్నారు.

## నారీ శక్తి చట్టం చరిత్రాత్మకం: డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్




(మొదటిపేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న భారత మహిళల విజయాలను ఆయన కొనియాడారు. సైప్రస్‌లో జరిగిన ఉమెన్స్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలిచి, ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌కు సవాల్ చేసే హక్కును పొందిన తొలి భారతీయ మహిళగా ఆర్. వైశాలి చరిత్ర సృష్టించడాన్ని ప్రస్తావించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఇస్రో శాస్త్రవేత్త రీతూ కరిధాల్ నుంచి ఒలింపిక్స్‌లో పీవీ సింధు, మీరాబాయి చాను, బాక్సింగ్‌లో నిఖత్ జరీన్ వరకు ఎందరో మహిళలు దేశానికి స్ఫూర్తిగా నిలుస్తున్నారని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన దాక్షాయణి వేలాయుధన్, హంసా మెహతా, దుర్గాబాయి దేశ్‌ముఖ్, విజయలక్ష్మీ పండిట్, రాజకుమారి అమృత్ కౌర్ వంటి వారి సేవలను పవన్ గుర్తు చేసుకున్నారు. "ప్రతిభకు అవకాశం తోడైనప్పుడు, మహిళలు నాయకత్వం వహిస్తారు, రాణిస్తారు, దేశాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఈ విజయాలన్నీ నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు.

## మీ ఇంటి నుంచే ఇంటి వివరాలు నమోదు చేయండి

- స్వీయ గణన ప్రక్రియలో భాగస్వాములుకండి
- అందుబాటులో https://se.census.gov.in పోర్టల్
- జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ



**విజయవాడ,కలంకౌంటర్ :** దేశంలో మొట్టమొదటి డిజిటల్ జన గణన తొలిదశలో భాగంగా ప్రారంభమైన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్ - ఎస్‌ఈ)లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఇంటి నుంచే సమాచారాన్ని నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కోరారు. ఈ నెల 16 నుంచి 30వ తేదీ వరకు స్వీయ గణన జరగనున్న నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించారు. ఈ స్టాల్ ద్వారా ప్రజలకు సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై అవగాహన కల్పించనున్నారు. కచ్చితమైన డేటాతో పాటు కీలకమైన జనగణనలో విస్తృత ప్రజాభాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు వివరించారు. https://se.census.gov.in పోర్టల్ ద్వారా ప్రజలు తమ వివరాలను పొందుపరుచుకోవచ్చన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ వల్ల సమయం ఆదా అవడంతో పాటు కచ్చితమైన డేటా పొందేందుకు వీలుంటుందన్నారు. 34 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిన అనంతరం ప్రివ్యూ చేసుకొని, ఫైనల్‌గా సబ్‌మిట్ చేయాలన్నారు. ఆ సమయంలో హెచ్ అక్షరంతో మొదలయ్యే 11 అంకెల విశిష్ట సంఖ్య (ఎస్‌ఈ ఐడీ) జనరేట్ అవుతుందని.. భవిష్యత్తులో గణాంక సిబ్బంది (ఎన్యూమరేటర్) వచ్చినప్పుడు ఎస్‌ఈ ఐడీని వారికి చూపించడం ద్వారా డేటా ధ్రువీకరణ పూర్తవుతుందని తెలిపారు. అదే విధంగా ఈ నెల 30 వరకు 15 రోజుల అవుట్‌రీచ్ క్యాంపయిన్‌లో భాగంగా ఒక్కోరోజు ఒక్కో వర్గం లక్ష్యంగా స్వీయ గణనపై ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వివరించారు. స్వీయ గణనలో ప్రజలందరూ పాల్గొని జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జేసీ ఇలక్కియ కోరారు. సమావేశంలో విజయవాడ ఆర్‌డీవో టీవీ సతీష్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్‌రెడ్డి, మెజిస్టీరియల్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.వెంకట రామయ్య, సీపీవో వై.శ్రీలత, సెన్సస్ మాస్టర్ ట్రైనర్ డా. కొల్లేటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com